# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 044
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జనవరి 24, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సామవేదం షణ్ముఖ శర్మకు సన్మానం



రాజమహేంద్రవరంలో జరుగుతున్న అద్భుతమైన మహాభారత ప్రవచనం 58 రోజు కార్యక్రమంలో పూజ్య గురువులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మని మాజీ కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పోలా నటరాజ్–శ్రావణి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి ఆశీస్సులు తీసుకోవటం చాలా ఆనందంగా ఉందని పోలా నటరాజ్ ప్రకటించారు.
–వరంగల్ వాయిస్, కాశీబుగ్గ

# వెలుగుల హారం.. మేడారం

## జాతరలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా

- రూ.5 కోట్లతో పటిష్టమైన నెట్‌వర్క్
- రంగంలోకి 50 ప్రత్యేక బృందాలు
- విధుల్లో 350 మంది ఎన్పీడీసీఎల్ సిబ్బంది
- 'స్కాడా'తో హైటెక్ నిఘా

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా.. మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర విద్యుత్ వెలుగులతో తళుకులీనుతోంది. కోటిన్నరకు పైగా భక్తులు హాజరయ్యే ఈ జాతరకు కనీవినీ ఎరుగని రీతిలో వెలుగులు పంచేందుకు ఎన్పీడీసీఎల్ యంత్రాంగం పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. సుమారు రూ. 5కోట్ల నిధులతో గద్దెల పరిసరాల నుంచి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల వరకు, జంపన్న వాగు నుంచి అటు తల్లుల గద్దెల వరకు, ఇటు బస్టాండ్ వరకు ప్రతి అంగుళాన్ని విద్యుత్ కాంతులతో నింపేశారు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న జాతర కోసం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి నేతృత్వంలో 50 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. విద్యుత్ సరఫరాకు రెప్పపాటు అంతరాయం కలుగకుండా మరో 350 మంది ఎన్పీడీసీఎల్ సిబ్బందిని అత్యవసర సేవల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నియమించారు. 'స్కాడా' సాంకేతికతతో హన్మకొండలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి విద్యుత్ వోల్టేజీ, ఫీడర్ లోడ్, అంతరాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జాతరలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ఎన్పీడీసీఎల్ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.
–వరంగల్ వాయిస్, మేడారం









8లో..


## మేడారానికి శాశ్వత ప్రయాణ సౌకర్యాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం

## ప్రధాన రహదారిపైనే పార్కింగ్

పట్టించుకోని అధికారులు | ఇబ్బందుల్లో వాహనదారులు

8లో..





### అత్యాధునిక సాంకేతికతతో ..

'స్కాడా' సాంకేతికతతో హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచే మేడారం జాతరలో విద్యుత్ వోల్టేజీ, ఫీడర్ లోడ్, అంతరాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా 26 కిలోమీటర్ల పరిధిలో 11కేవీ లైన్లకు, 15 కిలోమీటర్ల పరిధిలో 33కేవీ లైన్లకు 'కవర్డ్ కండక్టర్లను' (ఇన్సులేటెడ్ వైర్లు) అమర్చారు. దీనివల్ల వ్యాపారులు అక్రమంగా కొక్కెలు వేసి విద్యుత్ వినియోగించుకోవడం సాధ్యం కాదు. అత్యవసర పనుల కోసం 30 ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచారు. తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట వంటి కీలక ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, భక్తులకు చీకటి కష్టాలు లేకుండా ఎన్పీడీసీఎల్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.



# వెలుగుల హారం..
# మేడారం

- జాతరలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా
- రూ.5 కోట్లతో పటిష్టమైన నెట్‌వర్క్
- రంగంలోకి 50 ప్రత్యేక బృందాలు
- విధుల్లో 350 మంది ఎన్పీడీసీఎల్ సిబ్బంది
- 'స్కాడా'తో హైటెక్ నిఘా





**వరంగల్ వాయిస్, మేడారం :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర విద్యుత్ కాంతులు జిగేల్ మనిపిస్తోంది. కీకారణ్యం విద్యుత్ వెలుగుల్లో తలుకులీనుతోంది. తల్లుల గద్దెలతోపాటు జంపన్న వాగు, బస్టాండ్, అతిథి గృహాలు, బక్తులు విడిది చేసే ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా హైటెన్షన్ విద్యుత్ దీపాలను అమర్చారు. రెప్పపాటు విద్యుత్ అంతరాయం కలుగకుండా ఎన్పీడీసీఎల్ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి నేతృత్వంలో సుమారు రూ.5 కోట్ల నిధులతో జాతర ప్రాంతమంతా విద్యుత్ దీపాలను అమర్చారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యాజమాన్యం వెల్లడించింది. ఈ నెల 28 నుంచి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో మేడారం పరిసరాలన్నీ ఇప్పటికే జిగేల్‌మంటున్నాయి.


### అత్యున్నత స్థాయి పర్యవేక్షణ ..

జాతరను విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఒక భారీ సైన్యం రంగంలోకి దిగింది. ఇద్దరు సీజీఎంలు, ఏడుగురు డీఈలు, 20 మంది ఏడీఈలు, 150 మంది ఇంజినీర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది కలిపి మొత్తం 350 మంది ఐదు రోజుల పాటు నిర్విరామంగా ఇక్కడే విధులు నిర్వహించనున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా 50 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిని ఒక బృందం పర్యవేక్షించేలా విధులను కేటాయించారు. నార్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. దీని ద్వారా పార్కింగ్ స్థలాలు, దుకాణాలు, పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుతుంది. జాతర పరిధిలో మొత్తం 193 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. జాతరలో ఏదైనా ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే పస్రా, ములుగు లేదా కమలాపూర్ సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరిగేలా గ్రిడ్ అనుసంధానం చేశారు.









# ప్రజల పక్షపాతి 'వరంగల్ వాయిస్'

**● ఘనంగా 2026 క్యాలెండర్ ఆవిష్కరణ**



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రతి అక్షరాన్ని ప్రజా హితం కోసమే రాస్తూ, ప్రజల పక్షపాతిగా 'వరంగల్ వాయిస్' దినపత్రిక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ కొనియాడారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వరంగల్ వాయిస్ దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల సమస్యలను, గ్రామాల్లో నెలకొన్న ఇబ్బందులను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో వరంగల్ వాయిస్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పత్రికా యాజమాన్యానికి, జర్నలిస్టులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.పత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి నాయకత్వంలో పత్రిక విలువలతో కూడిన



జర్నలిజాన్ని అందిస్తోందని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రశంసించారు.

### ములుగు జిల్లా ఐజేయూ ఆధ్వర్యంలో..

సమాజంలోని సమస్యలను వెలుగులోకి తెస్తూ, వాటి పరిష్కారమే లక్ష్యంగా 'వరంగల్ వాయిస్' దినపత్రిక ముందుకు సాగుతోందని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షులు షఫీ అహ్మద్ కొనియాడారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో వరంగల్ వాయిస్ దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షఫీ అహ్మద్ మాట్లాడుతూ.. పత్రికా రంగంలో వరంగల్ వాయిస్ తనదైన ముద్ర వేసిందని, ప్రజలకు ఉపయోగపడే అర్థవంతమైన కథనాలను అందిస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులో ఈ పత్రిక మరింత ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, సీనియర్ జర్నలిస్టులు సుంకరి సంపత్, చుంచు రవి, గుగ్గిళ్ల సృజన్, సాంబయ్య, పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పు.. కేంద్రానిది కుట్రపూరిత చర్య

- కూలీలతో కలిసి గ్రామసభల్లో తీర్మానాలు
- నిరసన తెలిపిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హన్మకొండ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిరసన బాట పట్టాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన శనివారం పలు గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి గ్రామసభలు నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం కేశవపురం, తిమ్మాపూర్, గుంటూరుపల్లి గ్రామాలలో మరియు హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో భారీ గ్రామసభలు జరిగాయి. పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ కూలీల చేత తీర్మానాలు చేయించారు. ఈ తీర్మాన పత్రాలను జిల్లా కాంగ్రెస్ ఇంచార్జిలు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు దుదిల్ల శీను బాబు, మోత్కూరి ధర్మారావు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వోడిదేల ప్రణవ్ లకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం సిగ్గుచేటు. గాంధీ పేరును రూపుమాపి గాడ్సే పేరును తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే ఈ పథకంలో మార్పులు చేస్తున్నారని, దీనివల్ల గ్రామీణ కూలీలకు ఉపాధి కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పథకం పేరును పాతపద్ధతిలోనే కొనసాగించాలని, కూలీలకు పూర్తి పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, స్థానిక మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బంది కలిగితే సహించం

**■ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, వేలేరు/పీచర :** మినీ మేడారంగా పేరుగాంచిన వేలేరు మండలం పీచర గ్రామంలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. శనివారం పీచర గ్రామంలో జాతర ఏర్పాట్లను ఆయన సంబంధిత శాఖల అధికారులు, జాతర కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరాలో ఎక్కడా లోపాలు ఉండకూడదు. జాతర స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో వ్యవహరిస్తూ, ఉత్సవం జరిగే నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అదనపు సిబ్బందిని నియమించుకుని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.జాతర ప్రాంగణంలో తక్షణమే లైటింగ్ ఏర్పాటు చేయాలి. దీనికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ వారు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. అధికారులు, జాతర కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక సర్పంచులు ఒకే తాటిపై ఉండి సమన్వయంతో పనిచేయాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా జాతరను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, విద్యుత్, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు, జాతర కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో వసంత పంచమి



**వరంగల్ వాయిస్,పరకాల :** జ్ఞానానికి అధిదేవత అయిన సరస్వతీ మాత జన్మదినం 'వసంత పంచమి'ని పురస్కరించుకుని, పరకాల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం మాఘమాసం శుద్ధ పంచమి పర్వదినం సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. సరస్వతీ మాత ఆశీస్సులతో చిన్నారులు విద్యాభ్యాసానికి తొలి అడుగు వేయడం ఎంతో శుభప్రదమని పాఠశాల బాధ్యులు తెలిపారు. చిన్నారులతో అక్షరాలు రాయించి, వారికి విద్యాబుద్ధులు సిద్ధించాలని వేద మంత్రాల సాక్షిగా అక్షరాభ్యాస క్రతువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు సాధు సర్వశం, కార్యదర్శి చందుపట్ల చంద్రమోహన్, కోశాధికారి యర్రం రామన్న, ప్రధానాచార్యులు పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శిశు మందిర్లలో అందించే సంస్కారవంతమైన విద్య బాలల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాతాజీలు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రానికి చెందిన బంగారు యాకయ్య అనారోగ్యంతో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శనివారం యాకయ్య నివాసానికి చేరుకున్న ఆయన, మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాడుగుల రాజు మాట్లాడుతూ.. యాకయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శించిన వారిలో వార్డు మెంబర్ ఇస్లావత్ హరీష్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బోట్ల శ్రీకాంత్, చిన్నపెల్లి దర్గయ్య, పసుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలి




**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలో మొక్కల పెంపకం కోసం చేపట్టిన 'బ్యాగ్ ఫిల్లింగ్' (మట్టి నింపే ప్రక్రియ) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నర్సరీలలో నాణ్యమైన మొక్కలు పెంచడానికి సారవంతమైన మట్టిని ఉపయోగించాలని సూచించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే పెద్ద వృక్షాలను అధిక సంఖ్యలో పెంచాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొట్ల శ్యామల, పంచాయతీ కార్యదర్శి దొంతుల కరుణాదేవి, వార్డు సభ్యులు పసుల మంజుల, బందెల రమ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి రంజాన్, ఫీల్డ్ అసిస్టెంట్ బొట్ల శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వివక్ష లేని సమాజమే లక్ష్యం

**'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా..**

**భా**రతదేశం సాంప్రదాయాలకు, సంస్కృతులకు నిలయం. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అని నమ్మే దేశం మనది. కానీ, వాస్తవ పరిస్థితుల్లో నేటికీ ఆడపిల్లలు అనేక సవాళ్లకు గురవుతున్నారు. ఈ వివక్షను తొలగించి, వారి హక్కులను కాపాడటానికి ప్రతి ఏటా జనవరి 24న భారత ప్రభుత్వం "జాతీయ బాలికా దినోత్సవం" నిర్వహిస్తోంది. 2008లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. జనవరి 24వ తేదీని ఎంచుకోవడానికి ఒక బలమైన కారణం ఉంది. 1966లో ఇదే రోజునఇందిరా గాంధీ భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒక మహిళ దేశ అత్యున్నత పదవిని అధిరోహించడం అనేది కోట్ల మంది బాలికలకు నేటికీ స్ఫూర్తిదాయకం.

### ఆటంకాలు - సవాళ్లు

మనం 21వ శతాబ్దంలో ఉన్నప్పటికీ, నేటికీ ఆడపిల్లల పట్ల కొన్ని సామాజిక రుగ్మతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆహారం, విద్య, వస్త్రధారణలో అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం. ఆర్థిక ఇబ్బందులు లేదా సామాజిక కట్టుబాట్ల వల్ల మారుమూల ప్రాంతాల్లో బాలికలను పాఠశాలలకు పంపకపోవడం. శారీరక, మానసిక పరిపక్వత రాకముందే పెళ్లిళ్లు చేయడం వల్ల వారి కలలు కల్లలవుతున్నాయి. బయటి ప్రపంచంలోనే కాకుండా, కొన్నిసార్లు ఇళ్లలోనే వేధింపులకు గురికావడం ఆవేదన కలిగించే అంశం. విద్య అనేది బాలికల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. చదువుకున్న అమ్మాయి తన హక్కుల గురించి పోరాడగలదు. పేదరికం, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి విద్యే ఏకైక మార్గం. సమాజ అభివృద్ధిలో బాలికల భాగస్వామ్యం అత్యంత కీలకం.

### మన బాధ్యత - కర్తవ్యం

ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే, ఆ దేశంలోని మహిళల స్థితిగతులను చూడాలని మహాత్మా గాంధీ అన్నారు. ఆడపిల్ల రేపటి సమాజానికి కేవలం తల్లి, చెల్లి మాత్రమే కాదు.. ఒక గొప్ప నాయకురాలు, శాస్త్రవేత్త, క్రీడాకారిణి కాగలదు. బాలికలను భారంగా కాకుండా, దేశానికి లభించిన వరంగా భావిద్దాం. వారికి రక్షణ కల్పిద్దాం, స్వేచ్ఛను ఇద్దాం. అప్పుడే "నవ భారతం" కల నిజమవుతుంది.

వ్యాసకర్త
అశోక్ పోగు, (సైకాలజిస్ట్&మోటివేషనల్ స్పీకర్)
తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు



# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- 62 తులాల బంగారం స్వాధీనం
- పోలీసులను అభినందించిన ఏసీపీ



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ పోలీసుల చాకచక్యం ముందు బెంగాల్ దొంగ ఆటలు సాగలేదు. హనుమకొండ నగరంలోని పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీల్లో భారీ చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను వరంగల్ కమిషనరేట్ పోలీసులు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో సినీ ఫక్కీలో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుండి సుమారు రూ.9లక్షల విలువ గల 62 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హనుమకొండ ఏసీపీ పి.నర్సింహారావు వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫిరోజ్ షేక్ గతంలో అనేక దొంగతనాలు చేసి 7 సార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. ఇతడు మరో ముగ్గురు సభ్యులతో (పెరోజ్ షేక్, సుక్ చంద్, యామిన్) గ్యాంగ్‌గా ఏర్పడి హనుమకొండలో రెచ్చిపోయాడు. గత ఏడాది డిసెంబర్ 17న పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి భారీగా బంగారం దోచుకెళ్లారు. ఈ గ్యాంగ్‌లోని ముగ్గురు సభ్యులను ఈ నెల 13న పోలీసులు పట్టుకోగా, ప్రధాన నిందితుడు ఫిరోజ్ షేక్ కీలక వ్యక్తి అని తేలింది. చోరీ చేసిన బంగారం అంతా తన వద్దే ఉంచుకొని బెంగాల్‌కు పరారయ్యాడు. వరంగల్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏర్పడిన స్పెషల్ టీం (కేయూసీ ఎస్సై నవీన్ కుమార్, సీసీఎస్ ఎస్సై రాజ్ కుమార్ బృందం) పశ్చిమ బెంగాల్‌కు చేరుకుంది. ముర్షిదాబాద్ జిల్లాలో 9 రోజుల పాటు నిందితుడి కదలికలపై నిఘా ఉంచి, అతడిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 62 తులాల బంగారాన్ని రికవరీ చేసి వరంగల్‌కు తరలించారు. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కేయూసీ ఇన్స్‌పెక్టర్ ఎస్.రవికుమార్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ కె.రామకృష్ణ, ఎస్సైలు నవీన్ కుమార్, రాజ్ కుమార్, ఇతర హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఏసీపీ నర్సింహారావు ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావం చూపిన సిబ్బందికి ఈ సందర్భంగా నగదు రివార్డులను అందజేశారు.

# అశ్వమిత్ గౌతమ్‌పై అక్రమ కేసులు రద్దు చేయాలి

- బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజంలోని అక్రమాలపై ప్రశ్నిస్తున్న 14 ఏళ్ల దళిత బాలుడు అశ్వమిత్ గౌతమ్‌పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్‌లో బీసీ నాయకులతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న అన్యాయాలు, పాలకుల అవినీతి, ప్రజా సమస్యలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న మైనర్ బాలుడు అశ్వమిత్ గౌతమ్‌ను చూసి యూపీ ప్రభుత్వం బెంబేలెత్తుతోందని విమర్శించారు. మైనర్ అని కూడా చూడకుండా లక్నోలో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి, సెక్షన్ 151 కింద అరెస్టు చేయడం అత్యంత దారుణమన్నారు. ఆటపాటలతో గడపాల్సిన వయసులో సమాజం పట్ల బాధ్యతతో.. కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రజా సంపద, పేదల భూముల ఆక్రమణలు, నిరుద్యోగం, మహిళలపై అఘాయిత్యాల వంటి అంశాలపై అశ్వమిత్ ఎంతో పరిణతితో ప్రశ్నిస్తున్నాడని పేర్కొన్నారు. "ఈ దేశం అందరిదీ.. మేల్కొనండి" అని పిలుపునివ్వడం, వాక్ స్వాతంత్రాన్ని కాపాడుకోవాలని కోరడం అక్షర సత్యమని ఆయన అన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, అశ్వమిత్ గౌతమ్‌పై పెట్టిన కేసులను ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, బీసీ నాయకులు చెలుకల రాజు, చంద్రశేఖర్, బానోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- బీజేపీ నేత కాళీ ప్రసాద్ రావు
- అగ్రంపహాడ్ జాతరలో వసతులు కల్పించాలి
- అసంపూర్తి పనులపై బీజేపీ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలో మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లపై ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం సరికాదని బీజేపీ పరకాల కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల కాళీ ప్రసాద్ రావు విమర్శించారు. శనివారం మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డితో కలిసి ఆయన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ జాతరకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను పరిశీలించిన ఆయన, తక్షణమే భక్తులకు త్రాగునీరు, స్నాన ఘట్టాలు, నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అగ్రంపహాడ్ జాతరను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. జాతర చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను భక్తుల సౌకర్యార్థం వినియోగించుకోవడానికి రైతులకు సరైన పరిహారం చెల్లించి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంద్ర మధు, జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, చౌల్లపల్లి సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ గుల్లపెల్లి వెంకన్న, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు పూజారి రవి, పీసాల సాంబయ్య, వజ్ర రవికుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, బీజేవైఎం అధ్యక్షులు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బతుకంతా రెచ్చగొట్టే రాజకీయం

- ఆ పార్టీ నేతలపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- పదేళ్ల పాపాలకు విచారణ తప్పదు
- జిల్లాల విభజనపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు
- అబద్ధపు ప్రచారాలు నమ్మొద్దు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో ప్రజలను వంచించి, ఇప్పుడు కేవలం రెచ్చగొట్టే రాజకీయాలతో పబ్బం గడుపుకుంటోందని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నేతల తీరుపై అగ్నిప్రేమలు కురిపించారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా ఉండాల్సిన బీఆర్ఎస్ నేతలు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, వారిపై రౌడీ షీట్లు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచితనం వల్లే వారు ఇంకా బయట తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ వేగంగా సాగుతోందని, ఇది కేటీఆర్ తో ఆగేది కాదని, త్వరలోనే దీని వెనుక ఉన్న 'పెద్దాయన' ఎవరో తేలుతుందని స్పష్టం చేశారు. పాపాలు చేసి వీర తిలకాలు దిద్దించుకునే వింత సంస్కృతి బీఆర్ఎస్ లో ఉందని ఎద్దేవా చేశారు. వరంగల్, హన్మకొండ జిల్లాల విభజన లేదా విలీనంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదన్నారు. ఎన్నికల లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బిడ్డ పెళ్లికి ముందు రేవంత్ రెడ్డిని పోలీసులు బెడ్ రూమ్ నుంచి ఈడ్చుకెళ్లినప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం చేసిన పాపాలకు ఇంకో పది ఏళ్లు విచారణ చేసినా ముగిసిపోదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు కూడా కాలేదని, అప్పుడే బీఆర్ఎస్ నేతలు ఎందుకు ఇంతలా బట్టలు చించుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఉండటం నేర్చుకోవాలని హితవు పలికారు.

# ఆడపిల్ల ప్రతీ ఇంటికి ఒక అద్భుతమైన కానుక

◆ 'ఉజ్వల'తో బాలికల అభ్యున్నతికి బాటలు
◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** ఆడపిల్ల ఉన్న ప్రతి ఇల్లు ఎప్పుడూ సంతోషకరంగా ఉంటుందని, ప్రతీ కుటుంబానికి ఆమె ఒక గిఫ్ట్ వంటిదని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ, హక్కులు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై నిరంతరం పర్యవేక్షించేందుకు 'ఉజ్వల' అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉజ్వల కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడం. "బేటీ బచావో – డిజిటల్ హటావో" అనే సందేశంతో బాలికలను డిజిటల్ దుర్వినియోగం నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు. జిడీసీపీ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ శాఖ మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మూడు దశల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు "మిస్ జనగామ – 2026" పురస్కారాలను కలెక్టర్ అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకుముందు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలతో కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ఇ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డి.సి.ఓ కోదండరాములు, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, జి.సి.డి.ఓ గౌసియా బేగం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, పలు శాఖల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మేడారం వన దేవతల చెంత సీపీ సన్‌ప్రీత్ సింగ్

### కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం



**వరంగల్ వాయిస్,మేడారం/తాడ్వాయి :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం మేడారం సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జాతర ముగిసిన తర్వాత కూడా భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో, సీపీ దంపతులు అమ్మవార్ల గద్దెలపై నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన సీపీ దంపతులకు మేడారం ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సీపీ దంపతులను శాలువాతో సత్కరించి, అమ్మవార్ల ప్రసాదం, పసుపు–కుంకుమలను అందజేశారు. దర్శనం అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్, ములుగు ఎస్పీ శబరీష్ కేకన్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులతో భేటీ అయ్యారు. రాబోయే రోజుల్లో మేడారంకు వచ్చే భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణపై అధికారులతో చర్చించారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# 'ముద్దుబిడ్డ'కు పైసా ఖర్చు లేదు

### ఆడపిల్ల పుడితే కూరపాటిలో ఉచిత వైద్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమాలు నగరంలో హోరెత్తాయి. కూరపాటి హాస్పిటల్ నుంచిహనుమకొండ ప్రెస్ క్లబ్ వరకు నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని ఐఎంఏ బాధ్యులు డా.మన్ మోహన్ రాజు ప్రారంభించారు. అనంతరం ప్రెస్ క్లబ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి డా.పల్లేపాడు దామోదర్ జ్యోతి ప్రజ్వలన చేసి "ముద్దుబిడ్డ" కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'బేటీ బచావో జన్ ఆందోళన్' వ్యవస్థాపకులు డా.గణేష్ రాఖ్ మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ, విద్య, సాధికారత విషయంలో సమాజం సమిష్టి బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో కూరపాటి రమేష్ మరియు డా.రాధిక కూరపాటి దంపతులు తీసుకున్న నిర్ణయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కూరపాటి హాస్పిటల్‌లో ఆడపిల్ల జన్మిస్తే హాస్పిటల్ చార్జీలు ఏవీ ఉండవు, పూర్తిగా ఉచితం అని డా.రాధిక కూరపాటి ప్రకటించారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న కుటుంబాల్లో ఒక బాలికకు సుకన్య సమృద్ధి యోజన కింద నమోదు చేసి, మొదటి నెల ప్రీమియాన్ని కూరపాటి ఫౌండేషన్ భరిస్తుందని డా.కూరపాటి రమేష్ తెలిపారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పలువురు తల్లిదండ్రులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, ఐఎంఏ బాధ్యులు డా.సాంబమూర్తి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.భారతి, సీడబ్ల్యూసీ మెంబర్ డా.పరికి సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.సీతారాములు, డా.సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి, మేప్మా డీఎంసీ రజిత రాణి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా 'జాతీయ బాలికా దినోత్సవం'




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేటి బాలికలు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, విజ్ఞానం, పరిపాలన వంటి అన్ని రంగాలలో రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హై స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ గోపు జైపాల్ రెడ్డి అధ్యక్షతన బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిమ్మల శ్రీనివాస్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాలికలే రేపటి సమాజానికి మార్గదర్శకులని, వారి అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. శారీరక, మానసిక దృఢత్వం కోసం పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సమాజంలో పొంచి ఉన్న మోసాలు, మాయమాటల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని హితవు పలికారు. హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. బాలికల సాధికారత కోసం ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు సుభాషిణి, మినిదాస్, మీనాక్షి, జోత్స్న, వినయ, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం

### సర్పంచ్ బండి రేణుక శంకర్



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ అన్నారు. శనివారం నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి, మౌలిక వసతుల కల్పనకు నూతన పాలకవర్గం సహకరించాలని కోరారు. ఇందుకు స్పందించిన సర్పంచ్ రేణుక శంకర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తమ పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సర్పంచ్ బండి రేణుక శంకర్, ఉప సర్పంచ్ మామిడాల శ్రీనివాస్ రెడ్డి, వార్డు మెంబర్లు భీముడి విజయ, తూర్పాటి ఐలయ్య, భనువారి తిరుపతమ్మ, పొడిశెట్టి బ్రహ్మం, మీనుగు దేవేందర్, శీలం కవిత, పరిషవేణి కుమారస్వామి, పరిష బోయిన స్వరూప, శీలం రాకేష్, గంగారం నాగలక్ష్మి, బొల్లారం ప్రత్యూషలను పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, అంగన్‌వాడీ టీచర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్‌వాడీ టీచర్లు భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గొడుగులు, దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పేదవారికి సహాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉందని ఆత్మకూరు దేశాయి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలో పలు సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. మండలంలోని గుడెప్పాడ్ బస్టాండ్ వద్ద ఎండలో అరటి పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వ్యాపారులకు రవీందర్ గౌడ్ గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం తిరుమలగిరి గ్రామంలోని నిరుపేద వృద్ధులకు చలి నుంచి రక్షణ పొందేందుకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాలకు తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యకలాపాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సర్పంచ్ బూర దేవేంద్ర రాజేందర్, లయన్స్ రాజు, సోమయ్య, అనిత, దేవేందర్, రామకృష్ణ, టీ.సత్యనారాయణ, నాగబండి శివప్రసాద్, పాపని రవీందర్, రేవూరి దేవేందర్ రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముంద్రాతి సమ్మయ్యకు చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంద్రాతి సమ్మయ్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి సమ్మయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడాకారుడు 'సిద్ధు'కు ఆర్థిక భరోసా



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** షూటింగ్ బాల్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గ్రామీణ క్రీడాకారుడు అలువాల సిద్ధుకు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ.భిక్షపతి అండగా నిలిచారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సిద్ధు ప్రతిభను గుర్తించిన ఆయన, శనివారం తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో సిద్ధు పాల్గొనబోతున్నాడని, అతనికి ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థిక వెసులుబాటు లేదనే విషయాన్ని పర్వతగిరి స్వేరోస్ నాయకులు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎంఈఓ భిక్షపతి, రవాణా ఖర్చుల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సహాయాన్ని సిద్ధుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధు జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. స్వేరోస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గారే జయరాజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిని వెన్నుతట్టి ప్రోత్సహించడానికి సమాజంలో స్థిరపడిన వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిద్ధుకు సాయం చేసిన ఎంఈఓ గారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో నాయకులు గౌతమ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** స్నేహం అంటే కేవలం కలిసి గడపడం మాత్రమే కాదు, కష్టకాలంలో తోడుండటమని పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన బాల్యమిత్రులు నిరూపించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తమ స్నేహితుడు కట్టోజు రాజు కుటుంబాన్ని పరామర్శించి, మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం కట్టోజు రాజు నివాసానికి చేరుకున్న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాజు మరణం తమకు తీరని లోటని, అతని స్నేహశీలతను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మిత్రుడి కుటుంబం ఇబ్బందుల్లో ఉండకూడదనే ఉద్దేశంతో తమ వంతుగా సేకరించిన రూ.20,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. జుట్టుకొండ కర్ణాకర్, పడిదెల ఆనందరావు, అమడగాని రాజు యాదవ్, పోకల కుమారస్వామి, దాడి సదానందం, కరిమిల్ల రాజు రావు, తోపుచర్ల అనిల్ రావు, వడ్డె దుర్గయ్య, నాల్లం రాజు, రాసూరి రాజు, అమడగాని రమేష్, కొంగ రాజు, మార్గం రవీందర్, శ్రీరాముల శ్రీనివాస్, వడ్డె రాజు, కరిమిళ్ళ దేవేందర్ రావు, గ్యారె రవి, పాపని సుజాతతో పాటు బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజేశ్వర రావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మోకిడి రాజేశ్వర రావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం వారి స్వగృహానికి చేరుకుని, రాజేశ్వర రావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులైన మోకిడి శ్రీను, లింగ రావులను గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో శాయంపేట మండల మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, సీనియర్ నాయకులు సదా శివ రెడ్డి, కిషన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ ఉప సర్పంచ్ కొత్తగట్టు సాయి కృష్ణ, 8వ వార్డు మెంబర్ స్వర్ణ – వినయ్, అమ్మ అశోక్, లక్ష్మ రెడ్డి, పాషా, రవీందర్, భాస్కర్, తిరుపతి, భూక్యా భాస్కర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- హనుమకొండ ఏసీపీ నరసింహారావు
- చోరీలకు తెగబడిని అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
- రూ. 51 వేల నగదు, బంగారం స్వాధీనం
- సిబ్బందిని అభినందించిన ఏసీపీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండ్ల తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని హనుమకొండ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. శనివారం హనుమకొండ ఏసీపీ పి. నరసింహారావు విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్ట్ వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలానికి చెందిన గూగులోతు నవీన్ వృత్తిపరంగా దొంగతనాలు చేయడమే పనిగా పెట్టుకున్నాడు. 2023 నుంచి ఇప్పటివరకు ఇతనిపై సుమారు 17 దొంగతనాల కేసులు ఉన్నాయి. గతంలో పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా, నిందితుడి తీరులో మార్పు రాలేదు. ఇటీవల సంక్రాంతి సెలవులను ఆసరాగా చేసుకుని హనుమకొండ, మట్వాడ మరియు హైదరాబాద్‌లోని కుషాయిగూడ పరిధిలో వరుస చోరీలకు పాల్పడ్డాడు. మరోసారి దొంగతనం చేసే ఉద్దేశంతో శుక్రవారం హనుమకొండ బస్టాండ్‌కు వచ్చిన నవీన్‌ను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 12 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ. 51,000 నగదుతో పాటు తాళాలు పగలగొట్టడానికి ఉపయోగించే పట్కార్, స్క్రూడ్రైవర్లు, ఐరన్ రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. జాతరలు, సెలవుల సమయంలో ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఇళ్లలో ఉంచకుండా తమ వెంట తీసుకెళ్లడం లేదా సురక్షితమైన లాకర్లలో ఉంచుకోవడం మంచిదని హితవు పలికారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది హరిప్రసాద్, కుమార్లను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, ఎస్సైలు పరశురాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నారం చెరువు తూముకు మరమ్మత్తులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం దర్గా చెరువు తూము పూడికతో నిండిపోవడంతో పంట పొలాలకు నీరు అందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు తెరపడింది. రైతుల విజ్ఞప్తిపై పరకాల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తక్షణమే స్పందించి, తన సొంత నిధులతో తూము మరమ్మతు పనులకు ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం స్థానిక మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ సంయుక్తంగా తూము మరమ్మత్తు పనులను ప్రారంభించారు. గత కొంతకాలంగా తూము పూడికతో నిండి ఉండటంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే ఆయన సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు.తమ సమస్యను గుర్తించి సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఈ సందర్భంగా రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, సీనియర్ నాయకులు గొడుగు భిక్షపతి, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, శాఖా సిబ్బంది, స్థానిక వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు కేంద్రం 'భారీ' భరోసా

## రూ. 3.70 కోట్లు విడుదల



**వరంగల్ వాయిస్,వరంగల్ చౌరస్తా:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ, మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3.70 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ సందర్భంగా శనివారం వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ సంస్కరణలు దేశానికి ప్రమాదకరం

- ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ
- ఖమ్మంలో పీడీఎస్ యూ రాష్ట్ర 23వ మహాసభలు




**వరంగల్ వాయిస్, ఖమ్మం :** కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విద్యారంగాన్ని వ్యాపార లావాదేవీలకు వేదికగా మారుస్తున్నాయని, ఈ పెట్టుబడిదారీ సంస్కరణలు దేశ భవిష్యత్తుకే ప్రమాదకరమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మహాసభను ప్రారంభిస్తూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు సామాజిక శాస్త్రాలను నిర్వీర్యం చేస్తూ, కేవలం మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. నూతన విద్యా విధానం–2020 ద్వారా విద్యారంగంలో కాషాయీకరణను జొప్పించి, రాజ్యాంగ విరుద్ధంగా మత రాజ్యాన్ని స్థాపించే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తోందని, కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యకు 15శాతం నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ముఖం చాటేయడం విద్యార్థులను వంచించడమేనన్నారు. అంతకుముందు పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ సంఘం జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ప్రముఖ విద్యావేత్త ఐ.వి. రమణారావు మాట్లాడుతూ సమాజ మార్పులో విద్యార్థుల పాత్ర క్రియాశీలకమన్నారు. టీపీటీఎఫ్ మాజీ నేత వి.మనోహర్ రాజ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ సంస్థల విధ్వంసాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అరుణోదయ కళాకారుల విప్లవ గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మహాసభలో పాల్గొన్న ప్రతినిధులను విశేషంగా ఉత్తేజపరిచాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎర్ర అఖిల్ కుమార్, ఎం.నరేందర్, ఎస్.రాకేష్, రాష్ట్ర నాయకులు అలువాల నరేష్, వి.కావ్య, పి.అనూష, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## రాజాసాబ్ నుంచి సహానా సహానా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ' ఒకటి. ప్రభాస హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలోడీ 'సహానా సహానా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస` నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా థియేటర్లలో ఆడుతోంది.



## నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల

తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.

## హీరోలుగా ఎంట్రీ ఇస్తున్న డిఎస్పీ, లోకేశ్ కనకరాజ్

తెర వెనక సత్తా చాటిన ఎందరో సాంకేతిక నిపుణులు, డైరెక్టర్లు తెర పైనా సందడి చేశారు. నటులుగానూ తమదైన ముద్ర వేశారు. ఇదే దారిలో ఇప్పుడు మరికొందరు హీరోలుగా పరిచయం కానున్నారు. రెండు దశాబ్దాలకు పైగా తన సంగీతంతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న దేవిశ్రీ ప్రసాద్ ఎల్లమ్మ' మూవీతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. డప్పు కళాకారుడిగా ఆయన నటిస్తున్నారు. 'బలగం' తర్వాత వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న చిత్రమిది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం కూడా డీఎస్పీనే అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. 'ఖైదీ', 'విక్రమ' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ థ్రిల్ చేసిన కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్  కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. వామికా గబ్బీ హీరోయిన్. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్` యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకులతోపాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన మలయాళ దర్శకుడు అభిషన్ జీవింత్ ఈ మూవీలో ఓ పాత్ర పోషించిన ఆయన.. 'విత్ లవ' తో హీరోగా మారారు. ఈ రొమాంటిక్ డ్రామాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న తెలుగులోనూ విడుదల కానుంది. కొరియోగ్రాఫర్ యశ్ హీరోగా 'ఆకాశం దాటి వస్తావా' సినిమాని 'దిల్ రాజు ప్రొడక్షన్స' సంస్థ గతంలో ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోనూ విడుదల చేసింది. కానీ, తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. ఈ విభిన్న ప్రేమకథా చిత్రానికి శశికుమార్ దర్శకుడు.  మాస్టర్ పీటర్ హెయిన్ మూవీ కూడా అంతే. అనౌన్స్ చేసి చాలాకాలమైనా మరో అప్‌డేట్ లేదు. ఈ చిత్రానికి మా వెట్రి దర్శకుడు. టైటిల్ ఇంకా ఖరారు కాలేదు.







## దురంధర్‌ను మించిన బోర్డర్-2

దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో ` పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం  ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

# మేడారానికి శాశ్వత ప్రయాణ సౌకర్యాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం భక్తులు, ప్రజలకు శాశ్వత రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్ ను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ మహాజాతర–2026 ఏర్పాట్లలో భాగంగా మేడారంలో రవాణా, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను ఆయన ప్రకటించారు. మేడారం జాతరకు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నాలుగు వేల ఆర్టీసీ బస్సులను ప్రణాళికబద్ధంగా నడుపుతున్నామన్నారు.

అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు పెంచే విధంగా శాఖ సిద్ధంగా ఉందన్నారు. జాతర ప్రయాణ సేవలు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కాలవ్యవధిలో ప్రయాణికులకు రవాణా సేవలతో పాటు భద్రత, ఆరోగ్య సహాయం వంటి అంశాల్లో కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా ఆర్టీసీ ఉన్నతాధికారులు జాతర విజయవంతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 2024లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతరకు రవాణా మౌలిక వసతులు కల్పించాలనే దూరదృష్టితో ముందడుగు వేశారని గుర్తు చేశారు. ప్రతి జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక పరిష్కారంగా శాశ్వత ఆర్టీసీ బస్‌స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మేడారం జాతర ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లు, క్యూ లైన్ల రూపకల్పన పూర్తిగా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు.

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఏటూరునాగారం ప్రాంతంలో ఆర్టీసీ డిపో మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనరగ్ ఈడీఓ మునిషేకర్ ఎడ్, ఈడీ సోలోమన్, సీటీఎం వెంకన్న, వరంగల్ ఆర్ఎం శ్రీధర్, వరంగల్ డిప్యూటీ ఆర్ఎం విజయభానువు, బానుకిరన్, బృందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## రూ.151 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి



**వరంగల్ వాయిస్, కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో రూ.151 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి శనివారం శంకుస్థాపన చేశారు. కేసముద్రం మండల కేంద్రంలో రూ.23 కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణంతోపాటు రూ.61.86 లక్షలతో కేసముద్రం మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ పనులు, రూ.4 కోట్లతో మండల కేంద్రంలో బస్ స్టేషన్ నిర్మాణం, రూ.60 కోట్లతో పాలిటెక్నిక్ కాలేజీ భవన నిర్మాణం, రూ.2 కోట్లతో సేవలాల్ సంత్ బంజారా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, రాష్ట్ర రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ డాక్టర్ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## యాభై వేల మాస్కుల పంపిణీ

- సీసీఎస్ పోలీసుల ఔదార్యం



**వరంగల్ వాయిస్, క్రైం :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విధులు నిర్వహించేందుకు తరలి వెళ్లే పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్ర డ్రగ్స్ ఔషధ గిడ్డంగుల విభాగం సహకారంతో సేకరించిన యాభై వేల మాస్కులను సీసీఎస్ పోలీసులు వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మేడారం విధులు నిర్వహించే పోలీసులు తప్పని సరిగా మాస్క్ లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు బాలస్వామి, ప్రభాకర్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్ర డ్రగ్స్ ఔషధ గిడ్డంగుల ఇంచార్జి డాక్టర్ భాస్కర్ రావు, ఏసీపీలు సదయ్య, జాన్ నర్సింహులు, సురేంద్ర, ప్రశాంత్ రెడ్డి, సత్యనారాయణ, సీసీఎస్ పర్వతగిరి ఇన్ స్పెక్టర్లు రాఘవేందర్, రాజగోపాల్ పాల్గొన్నారు.

### 24x7 పనిచేయాలి..

సమాజన రక్షణకు 24x7 పనిచేయాల్సి ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఆర్మ్యాడ్ రిజర్వ్ పోలీసులకు 15 రోజుల పాటు నిర్వహించిన పునఃశ్చరణ శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, ఏసీపీలు జితేందర్ రెడ్డి, నాగయ్య, సురేంద్ర, అంతయ్య, ఆర్ఐలు సతీష్, చంద్రశేఖర్, శ్రీధర్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపైనే పార్కింగ్

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మేడారం జాతర సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారి రద్దీగా మారింది. మేడారంతోపాటు ఇతర ప్రాంతాలకు పోయే వాహనాలతో ఈ రోడ్డు బిజీబిజీగా మారింది. ఉదయం మేడారం జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో ముఖ్యంగా రద్దీ సమయంలో ఆత్మకూరు పాత బస్టాండ్ టీ స్టాళ్ల వద్ద ఆపి టీ, కాఫీలు తాగుతూ, మిర్చి బజ్జీలు తింటూ సేద తీరుతున్నారు. దీంతో పాత బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. మూలమలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. పక్కనే బస్టాండ్ ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటున్నారని దీంతో బస్సులు నిలిపేందుకు వీలులేకపోవడంతో ప్రయాణికులను పట్టించుకోకుండానే వెళ్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వేగంగా వాహనాలు దూసుకురావడంతో ప్రయాణికులు భయం భయంగా రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే మండలంలోని గుడెప్పాడు సెంటర్ వద్ద అటు భూపాలపల్లి, హనుమకొండ మొలుగు నాలుగు పక్కల వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. స్థానిక పోలీసులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాత బస్టాండ్ సమీపంలో ఎలాంటి వాహనాలు నిలుపకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందంటున్నారు. అప్పుడే మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఎలాంటి ఆటంకాలు లేకుడా తమ ప్రయాణాన్ని సాగించగలరంటున్నారు.





## 565 ఇందిరా మహిళా శక్తి స్టాల్స్

- మంత్రి సీతక్క చొరవతో మహిళలకు లబ్ది

**వరంగల్ వాయిస్, మేడారం :** మహిళాభ్యున్నతికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి సందర్భాన్ని మహిళల ఆర్థిక చేయూతకు అవకాశంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించుటకు ఇందిరా మహిళా శక్తి ద్వారా రూ. 6 కోట్ల వ్యయంతో 565 షాపులను ప్రభుత్వం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మంజూరు చేసింది. మొత్తం 37 లొకేషన్లలో 27 రకాల వ్యాపారాలను మహిళలు నిర్వహించనున్నారు. అందులో మేడారం చుట్టుపక్కల ప్రాంతాల్లో 464 యూనిట్స్, మేడారం రాక పోకలు జరిగే మార్గంలో 63 యూనిట్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన యూనిట్స్ ఇతర ప్రాంతాల్లో నెలకొల్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సెర్ఫ్ బ్యాంక్ లింకేజ్ రూ. 341.30 లక్షలతో 315 యూనిట్స్, సెర్ఫ్ సీఐఎఫ్ నిధులు రూ. 86.50 కోట్లతో 80 యూనిట్లు, స్త్రీనిధి రూ. 92 లక్షలతో 90 యూనిట్లు, మండల సమాఖ్య సీఐఎఫ్ రూ. 64 లక్షలతో 60 యూనిట్లు, గ్రామ సమాఖ్య నిధులు రూ. 19.50 లక్షలతో 20 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో ఈ ప్రాంత మహిళలు లబ్ధి పొందనున్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా తెలంగాణ పిండి వంటలు, బెల్లం, కొబ్బరికాయలు, పూలు, భోజన, అల్పాహార, కిరాణా జనరల్ స్టోర్, కూల్ డ్రింక్స్, పాలు, ఫాస్ట్ ఫుడ్, మొబైల్ ఫిష్ & కర్రీ అవుట్ లెట్, కోళ్ల విక్రయ అవుట్ లెట్, కోడి గుడ్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి పథకం అండగా నిలుస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com